بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Full Text of Friday Sermon Hazrat Khalifatul Masih V, 03 April 2026 (Telugu)

## హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం విజ్ఞానపూరిత ఉదేశాల ఆధారంగా తౌహీద్ (దైవ ఏకత్వ) విశ్వాసభరిత ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 03.04.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيْكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُوْلُهُ. أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ.
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయ పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

ప్రపంచంలో తౌహీద్ (దైవ ఏకత్వాన్ని)ను స్థాపించడం కోసం పవిత్ర ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పడిన తపన, చేసిన ప్రయత్నం మరియు చూపిన సాహసం, ఆయన అన్యారాధనపు ప్రతి అంశానికి వ్యతిరేకంగా ఒక దృఢమైన శిలలా నిలబడ్డారు, ప్రతి జాతి విగ్రహారాధన ఆలోచనలకు వ్యతిరేకంగా సత్యవాణిని వినిపించడం గురించి మనం చదువుతూనే ఉన్నాము.

ఈ అంశం గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా ప్రవచించారు. వేలాది ప్రమాదాలు తలెత్తినప్పటికీ, లక్షలాది మంది శత్రువులు, అడ్డుకునేవారు మరియు భయపెట్టేవారు ఎదురైనప్పటికీ పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన ప్రవక్తృత్వ వాదనపై మొదటి నుండి చివరి శ్వాస వరకు ఎంతటి పట్టుదలతో స్థిరంగా నిలిచారో గమనించవలెను.

వారింకా ఇలా వివరించారు. ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం సత్యం పట్ల ఎంతటి స్పష్టత కలిగి ఉన్నారంటే దైవ ఏకత్వం గురించి బోధించడం ద్వారా బహుదైవారాధనలో మునిగిపోయిన ప్రపంచంలోని అన్ని జాతులను, తెగలను మరియు ప్రజలను తనకు వ్యతిరేకులుగా మార్చుకున్నారు. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఒక్కసారిగా తనవారితోనూ మరియు ఇతరులతోనూ సంబంధాలను చెడగొట్టుకోవడం ఆ రోజుల్లో దేనికైతే అత్యధికంగా అసహ్యం వ్యక్తమయ్యేదో మరియు దేనివల్ల అయితే వందలాది కష్టాలు ఎదురవుతూ ప్రాణాపాయం కూడా పొంచి ఉండేదో అటువంటి 'తౌహీద్'ను దృఢంగా పట్టుకోవడం వెనుక ఏ ప్రాపంచిక ప్రయోజనం దాగి ఉంటుందో ఆలోచించవలెను.

ఆయనింకా ఇట్లనిరి. ఒక వివేకవంతుడైన వ్యక్తి ఆ పరిస్థితులపై లోతుగా ఆలోచిస్తే పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నియమించబడిన ఆ కాలం నిజానికి ఒక గొప్ప దైవిక సంస్కర్త మరియు ఆకాశ మార్గదర్శకుని అవసరమెంతో ఉన్న కాలం అని అర్థమవుతుంది. ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఇచ్చిన బోధనలు కూడా వాస్తవానికి అత్యంత అవసరమైనవి, సత్యమైనవి పవిత్రమైనవి.

హుజూర్ అలైహిస్సలాం ఇంకా ఇట్లు ప్రవచించారు. ముక్తికి ఆధారమైన దైవ ఏకత్వం, ఏ గ్రంథం ద్వారా ప్రపంచంలో అత్యధికంగా వ్యాపించింది? బైబిల్ (ఇంజీల్) ద్వారా ప్రపంచంలో దైవ ఏకత్వం వ్యాపించిందని ఎవరైనా చెప్పగలరా? ఎవరి బోధనలైతే ముగ్గురు దేవుళ్ళపై (త్రిత్వము) ఆధారపడి

ఉన్నాయో అటువంటి క్రైస్తవులు దైవ ఏకత్వాన్ని ఎలా చాటగలరు? వారి దృష్టిలో ఊహాజనిత స్వర్గం ఐరోపాలోని రెండు పెద్ద దేశాలైన రష్యా మరియు బ్రిటన్‌లకు సగం సగం పంచి ఇవ్వబడుతుంది. ఇప్పుడు ఇందులో మరిన్ని పెద్ద దేశాలు చేరిపోయాయి. అమెరికా వారు కూడా ఇలాగే అంటున్నారు, పైగా ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మసీహ్ ద్వితీయ ఆగమనం అని కూడా అనడం మొదలు పెట్టారు. విచారం! వారి దృష్టిలో ఏక దైవారాధకులు నరకాగ్నిలో వేయబడతారు.

నేడు ప్రపంచ పటంపై తౌహీద్ అనే పేరు, పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సమాజంలో తప్ప మరే ఇతర వర్గంలోనూ కనిపించదు. పవిత్ర ఖుర్ఆన్ తప్ప కోట్లాది మంది సృష్టిని దైవ ఏకత్వంపై నిలబెట్టి, అత్యంత గౌరవంతో ఆ సత్య దేవుని వైపు మార్గదర్శకత్వం చేసే మరే ఇతర గ్రంథం ఆనవాలు కూడా కనిపించడం లేదు. ప్రతి జాతి తమకంటూ ఒక కృత్రిమ దేవున్ని సృష్టించుకుంది. కానీ ముస్లింల దేవుడు మాత్రం ఆది నుండి శాశ్వతమైనవాడు, మార్పులేనివాడు మరియు తన పురాతన గుణగణాలలో మునుపటిలాగే ఉన్నాడు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు ఉపదేశించారు. ప్రపంచమంతటా బహుదైవారాధన, మార్గభ్రష్టత మరియు సృష్టి ఆరాధన విస్తరించి ఉన్న కాలంలో పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నియమించబడ్డారు. ప్రజలందరూ సత్య సూత్రాలను వదిలిపెట్టారు, సరైన మార్గంను మరిచిపోయి ప్రతి వర్గం వేర్వేరు దురాచారాల బాట పట్టారు. అరబ్బు దేశాల్లో విగ్రహారాధన పరాకాష్టలో ఉంది. పర్షియాలో అగ్ని ఆరాధన జోరుగా సాగుతోంది. భారతదేశంలో విగ్రహారాధనతో పాటు వేలాది రకాల సృష్టి ఆరాధనలు వ్యాపించాయి. ఇలాంటి సాధారణ మార్గభ్రష్టత సమయంలో అనగా ఆనాటి పరిస్థితులే ఒక గొప్ప ఆధ్యాత్మిక వైద్యుని మరియు సంస్కర్తను కోరుకుంటున్న తరుణంలో పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆవిర్భవించి, ప్రపంచాన్ని తౌహీద్ మరియు సత్కార్యాలతో ప్రకాశింపజేయడం, అన్ని అనర్థాలకు మూలమైన అన్యారాధనను వేళ్లతో సహా పెకిలించివేయడమే ఆయన దేవుని సత్య ప్రవక్త అని మరియు ప్రవక్తలందరిలో శ్రేష్ఠుడని ఒక స్పష్టమైన నిదర్శనం.

ఆయనింకా ఇలా అన్నారు. ప్రజలు దేవుని మార్గాన్ని మరచిపోయి, తౌహీద్‌ను వదిలిపెట్టినప్పుడు, దైవం తన తరపు నుండి ఒక దాసునికి పరిపూర్ణమైన అంతర్దృష్టిని ప్రసాదించి, తన వాణి మరియు సాక్షాత్కారంతో గౌరవించి మానవాళి మార్గదర్శకత్వం కోసం పంపుతాడు. తద్వారా జరిగిన నష్టాన్ని ఆ దాసుడు సరిదిద్దుతాడు. దీని వెనుక ఉన్న అసలు సత్యం ఏమిటంటే లోకానికి ఆధారమైన మరియు ప్రపంచాన్ని నిలబెట్టే ఆ పరమాత్మ, తన అనుగ్రహాలను సృష్టికి అందించే గుణాన్ని ఎన్నడూ ఆపడు లేదా దానిని నిష్క్రియంగా వదిలివేయడు. బదులుగా అతని ప్రతి గుణం దాని సమయం వచ్చినప్పుడు వెంటనే వ్యక్తమవుతుంది.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఈ కాలంలో అల్లాహ్ తఆలా తన వాగ్దానం ప్రకారం పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి నిజమైన ప్రేమికుడిని ఏకదైవత్వ స్థాపన కోసం నియమించాడని మనం చూస్తున్నాము. ఈ కాలంలో హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ అలైహిస్సలాం వాగ్దత్త మసీహ్ మరియు మహ్దీ మాహూద్‌గా అవతరించి పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బోధనలకు మరియు సున్నత్ (ఆచరణ)కు ఒక సజీవ ఆదర్శంగా నిలిచారు. తన విధేయార్హులైన యజమాని అనుసరణలో దైవ ఏకత్వాన్ని వ్యాపింపజేయాలనే తపనతో ఆయన (అ) హృదయం నిండి ఉండేది.

దీనికి సంబంధించి ఆయన రచనలు మరియు ఆచరణాత్మక జీవితంలోని కొన్ని ఉదాహరణలను నేను ఇక్కడ సమర్పిస్తున్నాను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా ప్రవచించారు. అల్లాహ్ తఆలాకు మాతో ఉన్న వ్యవహారం ఎంతో అద్భుతమైనది. మాకు అందిన اَنْتَ مِنِّیْ بِمَنْزِلَۃِ تَوْحِیْدِیْ وَتَفْرِیْدِیْ అనగా నీవు నా దృష్టిలో నా ఏకత్వము మరియు సాటిలేనితనం వంటి స్థానంలో ఉన్నావు అనే ఈ దైవవాణి ఒక కొత్త శైలికి చెందినది. ఇలాంటి పదాలను మేము ఇంతకు ముందెన్నడూ ఏ దైవ గ్రంథంలోనూ చూడలేదు. దీని అర్థం మాకు అర్థమైనంత వరకు ఏమిటనగా ప్రపంచంలో దైవ ఏకత్వానికి తీవ్రమైన అవమానం జరుగుతున్నప్పుడు, దానిని అత్యంత హేయంగా చూస్తున్నప్పుడు నియమించబడే వ్యక్తి 'తౌహీద్'కు ప్రతిరూపంగా ఉంటాడు.

బహుదైవారాధన మరియు దాని సూక్ష్మ రూపాల గురించి వివరిస్తూ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. ప్రతి రకమైన అన్యారాధన నుండి దూరంగా ఉండవలెను. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, గాలి, అగ్ని, నీరు లేదా భూమిపై ఉన్న మరే ఇతర వస్తువును ఆరాధ్య దైవంగా భావించకూడదు. ఇలాగే ప్రాపంచిక వనరులకు దేవునితో సమానమైన గౌరవాన్ని ఇవ్వకూడదు లేదా వాటిపైనే పూర్తిగా నమ్మకం పెట్టుకోకూడదు. మన స్వంత ప్రయత్నాలను లేదా ధైర్యాన్ని గొప్పగా భావించడం కూడా ఒక రకమైన అన్యారాధనే. వాస్తవానికి, మనం ప్రతి పనిని చేసిన తర్వాత కూడా 'మేము ఏమీ చేయలేక పోయాము' అని భావించవలెను. మన జ్ఞానం పట్ల గర్వపడకూడదు, మన పనుల పట్ల అహంకారం చూపకూడదు. మనల్ని మనం నిరంతరం అల్లాహ్ తఆలా ముందు అజ్ఞానులుగా, బలహీనులుగా భావిస్తూ అతని గడపపై శిరస్సు వంచి ప్రార్థించవలెను. మనిషి జ్ఞానం పరిమితమైనది మరియు దానికి ఒక గురువు అవసరం. కానీ దేవుని జ్ఞానం ఎవరిపైనా ఆధారపడదు.

హుజూరె అన్వర్ ఇంకా ఇట్లనిరి. నేటి కాల ప్రభావం వల్ల కొన్నిసార్లు పిల్లల్లో కూడా సందేహాలు తలెత్తుతున్నాయి. అల్లాహ్ తఆలాను ఎవరు పుట్టించారు? అల్లాహ్ తఆలా ఎక్కడి నుండి వచ్చాడు?' అని వారు అడుగుతూ ఉంటారు. బహుశా పెద్దలు వారికి చెప్తుండవచ్చు లేదా వారి మనసుల్లోనే ఇలాంటి ప్రశ్నలు మెదులుతుండవచ్చు. కానీ అల్లాహ్ తఆలా గుణగణాలు అపరిమితమైనవి. అతడు అనాది నుండి ఉన్నాడు మరియు అనంత కాలం వరకు ఉంటాడు. అతడు ప్రతి ఒక్కరినీ సృష్టించాడు, కానీ అతన్ని ఎవరూ సృష్టించలేదు. స్వయంగా ఉనికిలోకి వచ్చి, సమస్తాన్ని సృష్టించే ఒక అంతిమ శక్తి గురించి ఏ ఊహ చేసినా అది దేవుడు మాత్రమే.

హుజూర్ అలైహిస్సలాం ఇంకా ఇట్లు ఉపదేశించారు. దేవుడు మన నుండి కోరుకునే మరియు ముక్తికి ఆధారమైన నిజమైన దైవ ఏకత్వం ఏమిటనగా అల్లాహ్ తఆలాను తన ఉనికిలో సమస్త భాగస్వాముల నుండి పవిత్రమైనవానిగా నమ్మడం. అది విగ్రహమైనా, మనిషైనా, సూర్యచంద్రులైనా, లేదా తన స్వంత అహం, తన ప్రణాళికలు మరియు తంత్రాలైనా సరే. దేవునికి సాటిగా ఎవరినీ నిలబెట్టకూడదు. అతనికి వ్యతిరేకంగా ఎవరినీ శక్తిమంతునిగా భావించకూడదు, ఎవరినీ జీవదాతగా నమ్మకూడదు, ఎవరినీ గౌరవప్రదాతగా లేదా అవమానపరిచేవానిగా ఎన్నుకోకూడదు మరియు ఎవరినీ సహాయకునిగా స్థిరపరచకూడదు. రెండవది, తన ప్రేమను అతనికే అంకితం చేయడం, తన ఆరాధనను అతనికే ప్రత్యేకం చేయడం, తన ఆశలను అతనిపైనే పెట్టుకోవడం, తన భయాన్ని అతనికే పరిమితం చేయడం. కావున ఈ క్రింది మూడు రకాల ప్రత్యేకతలు లేకుండా ఏ దైవ ఏకత్వం పరిపూర్ణం కాదు.

ఒకటి: ఉనికి పరంగా దైవ ఏకత్వం. అనగా సమస్త సృష్టిని దేవుని ముందు శూన్యంగా భావించడం. రెండవది: గుణగణాల పరంగా దైవ ఏకత్వం. అనగా సృష్టికర్త మరియు ఆరాధ్యుని లక్షణాలు దైవానికి తప్ప మరెవరికీ ఆపాదించకపోవడం. మూడవది: ప్రేమ, విధేయత పరంగా దైవ ఏకత్వం. అనగా ప్రేమ వంటి ఆరాధనా గుణాలలో ఎవరినీ భాగస్వాములుగా చేయకుండా దేవునిలోనే లీనమైపోవడం.

ఆయన అలైహిస్సలాం ఇట్లనిరి. ఒక అశక్తుడైన మనిషిని దేవునిగా మార్చిన ఈ అసత్య ఆరోపణ వల్ల ఆకాశం బద్దలయ్యేంత పని జరుగుతోందని పవిత్ర ఖుర్ఆన్‌లో దేవుడు సత్యమే పలికాడు. ఈ బాధతో నా స్థితి ఎలా ఉందంటే మిగిలిన వారు స్వర్గాన్ని కోరుకుంటే నా జీవిత కాలంలోనే మనుషులు ఈ బహుదైవారాధన నుండి విముక్తి పొంది దైవ మహిమ వెల్లడి కావడాన్ని చూడటమే నా స్వర్గం. నా ఆత్మ నిరంతరం ఇలా ప్రార్థిస్తోంది. ఓ అల్లాహ్! నేను నీ తరపు నుండి వచ్చినవాడినే అయితే నీ అనుగ్రహ నీడ నాపై ఉంటే హజ్రత్ ఈసా అలైహిస్సలాం తనను తాను దేవుడిగా ప్రకటించుకున్నారనే (నఊజుబిల్లాహ్) నింద ఆయనపై నుండి తొలగిపోయే రోజును నాకు చూపించు.

గత ఎంతో కాలంగా నా ఐదు పూటల ప్రార్థన ఇదే. దేవుడు ఈ ప్రజలకు కనువిప్పు కలిగించుగాక! వారు అతని ఏకత్వాన్ని విశ్వసింతురు గాక! అతని ప్రవక్తను గుర్తింతురుగాక! మరియు 'తస్లీస్' (త్రిత్వము) అనే నమ్మకం నుండి పశ్చాత్తాపం వ్యక్తపరుతురు గాక!

హుజూరె అన్వర్ ఇట్లనిరి. క్రైస్తవం ఆచరణాత్మకంగా అంతరించిపోతోంది. త్రిత్వ సిద్ధాంతం ఇప్పుడు కేవలం పుస్తకాలకే పరిమితమైపోయింది. ముఖ్యంగా ఐరోపాలో ఆచరించేవారు చాలా తక్కువగా ఉన్నారు. ఆఫ్రికా మరియు దక్షిణ అమెరికాలో ఇంకా కొందరున్నారు. అయితే త్రిత్వ సిద్ధాంతాన్ని వదిలి పెడుతున్న వారు కూడా ఏకైక దేవుని వైపు రావడం లేదు. కనుక ప్రజలను దైవ ఏకత్వంపై నిలబెట్టడానికి సాధ్యమైనంత వరకు మనం ప్రయత్నం చేయవలెను.

ఏ ఉద్దేశ్యం నెరవేర్చడానికి అల్లాహ్ తఆలా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను పంపాడో మరియు ఏ దైవ ఏకత్వ బోధనను వారు సల్లల్లాహు అలైహి వసల్లం ప్రకటించారో ఆ నిజమైన దైవ ఏకత్వాన్ని ఆచరించేవారిగా మరియు ప్రపంచమంతటా వ్యాపింపజేసేవారిగా అల్లాహ్ మనందరిని అనుగ్రహించుగాక. ఎందుకంటే ప్రపంచ మనుగడకు ఇప్పుడు ఇదొక్కటే పరిష్కారం.

ఖుత్బా ముగింపులో హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గౌ॥ ఖ్వాజా జఫర్ అహ్మద్ గారు మాజీ అమీర్ జమాఅతె అహ్మదియ్యాహ్ జిల్లా సియాల్‌కోట్ మరియు గౌ॥ అజ్రా గో అలీ గారు ఆఫ్ బుర్కినా ఫాసో సద్గుణాలను ప్రస్తావిస్తూ మృతుల క్షమాపణ మరియు వారి ఉన్నత పదవుల కోసం ప్రార్థించారు.

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ۔ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ
اَعْمَالِنَا۔ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ۔ وَنَشْهَدُ أَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ
وَرَسُوْلُهٗ۔ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَأْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ
وَالْبَغْيِ۔ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ۔ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ۔